క్లుప్తంగా

ఆలయాల్లో పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం, మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజినేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కౌతాళంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధికంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివార్లకు సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



చౌడేశ్వరిదేవి అమ్మవారు

పెద్దకడబూరు : శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చౌడేశ్వరిదేవి ఆలయ అధ్యక్షుడు మఠం రామాంజినేయులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని చౌడేశ్వరి కాలనీలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు చేపట్టనున్నామన్నారు. అమ్మవారికి పూజ చేయించే భక్తాదులు తమ ఇంటి నుంచే నైవేద్యప్రసాదాన్ని తీసుకొనిరావాల్సిందిగా కోరారు.

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా శ్రీనాథ్‌గుప్తా



ఆదోని అర్బన్: కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ అన్ని రాష్ట్రాలకు రాష్ట్ర ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇందులో భాగంగా సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా, కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ఆదోనికి చెందిన వంకదారు శ్రీనాథ్‌గుప్తాను నియమించింది. అవోపా (ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మరియు వామ్ (ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ) ఆదోని పట్టణాధ్యక్షులుగా, లయన్స్ క్లబ్ కార్యదర్శిగా వంకదారు శ్రీనాథ్‌గుప్తా ఎన్నో సేవలు అందించారు.

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమిద్దాం

ఆదోని రూరల్: ఆదోని జిల్లా సాధన కోసం ఉద్యమిద్దామని ఆదోని జిల్లా సాధన సమితి కన్వీనర్ కల్లుపోతుల రంగన్న పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదోని నియోజకవర్గం పూర్తిగా వర్షాధార ప్రాంతం కావడంతో పంటలు సరిగా పండక రైతులు ప్రతిఏటా అప్పుల పాలవుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో ఆర్డీఎస్ కుడికాలువ నేటికీ పూర్తిగాక వ్యవసాయానికి సాగునీరు అందక, నిత్యం కరువుతో ప్రజలు, రైతులు అల్లాడిపోతున్నారన్నారు. ఆదోనిలో ఉన్న పరిశ్రమలన్నీ మూతబడి కార్మికులు జిన్నింగ్ మిల్లుల్లో మాత్రం ఉపాధిని పొందుతున్నారన్నారు. ఈనెల 21వ తేదీన కోర్టు ప్రాంగణంలోని రెవెన్యూ భవన్‌లో ఆదోని డివిజన్ స్థాయిలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రైవేట్ టీచర్లకు సెలవులు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా ఆయా పాఠశాల యాజమాన్యం సెలవులను ఇవ్వాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు నరేష్ అచారి డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థి సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా సెలవులను ప్రకటించిందన్నారు. అయితే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యం వారు సెలవుల రోజుల్లో కూడా ఉపాధ్యాయులను పిలిపించి వర్క్‌షాప్ పేరుతో మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు సోమశేఖర్, బీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు రమేష్, పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించినా ప్రైవేట్ పాఠశాలల్లో యాజమాన్యాలు ఆయా ఉపాధ్యాయులతో పనులు చేయించుకునేందుకు సిద్ధమయ్యాయని పీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శి సిద్దరాముడు, డివిజన్ అధ్యక్షులు అఫ్జల్‌బాషా, ఎర్రన్న ఆరోపించారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో డీఈఓ శామ్యూల్‌పాల్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడైనా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సెలవుల్లో ఉపాధ్యాయులతో పనులు చేయించుకొంటే 80998 83838 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సూచించారు.



జేకేఎల్‌ఎస్ పాఠశాల వద్ద దుస్థితి



ఈ దారిలో నడవాల్సిందే



వైఎస్సార్ నగర్‌లో రోడ్డు దుస్థితి

కనీసం గ్రావెలైనా వేయండి సారూ..!

కౌతాళం: కూటమీ ప్రభుత్వంలో అంత నిర్లక్ష్యంగా ఉంది. మండల కేంద్రమైన కౌతాళంలో వర్షం తగ్గి నాలుగు రోజులైనా ఇంక చాలా కాలనీలకు దారి దొరకడం లేదు. రోడ్లన్నీ మట్టివే కావడంతో బురద వదలడంలేదు. ఈ రోడ్ల కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి. అధికారులు కనీసం గ్రావెల్ అయినా వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

☛ బీఎస్ఎన్ఎల్ ఆఫీసు నుంచి ఎన్టీఆర్ నగర్‌కు ప్రధాన దారి కావడంతో ఈదారిలో వెళ్లాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకుని పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

☛ జేకేఎల్‌ఎస్ పాఠశాల వద్ద ఏర్పడ్డ గుంతలు రెండు అడుగుల లోతు ఉండడంతో రోడ్డు అంత బురద మయంగా మారడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వర్షం తగ్గినా.. అధిక వర్షాల వల్ల ఊట నీరు వస్తుండడంతో సమస్య తీవ్రంగా ఉంది. కనీసం గ్రావెల్ అయినా వేయాలని ఆ నగర్ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

☛ ఇక పింజారి గేరిలో పరిస్థితి ఇలాగే ఉంది. బాపురం ప్రధాన రోడ్డు నుంచి పింజారిగేరికి వెళ్లడానికి ప్రధాన రస్తా దారుణంగా తయారైంది.. అడుగుతీసి అడుగువేయలేక పోతున్నారు.

☛ వైఎస్సార్ నగర్ వాసుల కష్టం చెప్పనవసరం లేదు. 253 పట్టాలు ఉన్న ఈ నగర్‌లో కేవలం మూడు రోడ్లు మాత్రమే సిమెంటు రోడ్లుగా ఉన్నాయి. మిగతా కాలనీ పూర్తిగా మట్టి రోడ్లు కావడంతో వర్షం నీటితో పాటు డ్రైనేజీ నీరు నిల్వవుంటూ దోమల బెడదతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి మౌలికమైన సమస్యల్ని పరిష్కారించాల్సిన అవసరం ఎంతైన ఉంది.



పింజారి గేరికి వెళ్లే రస్తా(ఇన్‌సెట్)

నదులను శుభ్రంగా ఉంచుకోవాలి



నది తీర ప్రాంతంలో శుభ్రం చేస్తున్న సీడబ్ల్యూసీ అధికారులు

మంత్రాలయం రూరల్ : అందరూ నదులను శుభ్రంగా ఉంచుకుని..ప్రకృతిని గౌరవవించాలని సెంట్రల్ వాటర్ కమిషన్ సబ్ ఇంజనీర్ బి. నాగార్జున పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తుంగభద్ర నది తీరంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలో మండల అధికారులు స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. అక్టోబరు 2 వరకు పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. నది తీరంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, ఎప్పటికప్పుడు నది తీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల కేంద్రంలో మండల అధికారులు స్వచ్ఛతపై ఎంపీడీఓ కార్యాలయం నుంచి రాఘవేంద్ర స్వామి సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ప్రజలకు స్వచ్ఛత, శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ నూర్జహాన్, ఎంఈఓ మెయినుద్దీన్, రాఘన్న, ఈఓపీఆర్డీ ఉపేంద్రరెడ్డి, సీడీపీఓ రాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి క్రీడ పోటీలు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందవరం : మండల కేంద్రం నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభచాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రామకృష్ణరాజు తెలిపారు. శనివారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఆయన మాట్లాడుతూ..అండర్-19 ఫుట్‌బాల్ విభాగంలో యూ.పూజ, జ్యోతి, అండర్-17 ఖోఖో క్రీడా విభాగంలో అప్సనా ఉత్తమ ప్రతిభ చాటన్నారు. వీరు ఈ నెల 23, 24వ తేదీన ఎమ్మిగనూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరక్టర్లు జె. ఉమాపతి, అబ్దుల్‌లతీఫ్, సూరజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాసింగ్ సమస్య పరిష్కారం

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేరుశనగకాయల పాసింగ్ సమస్యను శనివారం ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పరిష్కరించారు. గత వారంలో పైలట్ ప్రాజెక్టు కింద వారం రోజులపాటు పాసింగ్ లేకుండా టెండర్ వేయాలని సబ్‌కలెక్టర్ వ్యాపారస్తులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే వారం రోజులపాటు టెండర్ వేసి గురువారం వ్యాపారస్తులు కుమ్మక్కై పూర్తి స్థాయిలో ధర తగ్గించారు. దీంతో యార్డు అధికారులు వ్యాపారులతో మాట్లాడినా కూడా ఫలితం లేకపోయింది. శుక్ర, శనివారాల్లో కూడా ధర తగ్గుముఖం పట్టించారు. స్పందించిన సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, హమాలీలతో శనివారం సాయంత్రం సమావేశం ఏర్పాటు చేసి, మార్కెట్‌లో ఉన్న పాసింగ్ సమస్యపై చర్చించారు. హమాలీలు దిగుబడులు నింపేటప్పుడు వ్యాపారులు ఇద్దరు కూలీలను పెట్టి మట్టిని తొలగించుకోవాలని, పాసింగ్ లేకుండానే టెండర్ వేయాలని ఆదేశించారు. ఇక నుంచి ధరలను తగ్గించవద్దని వ్యాపారస్తులకు సూచించారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బ్యాంక్ సిబ్బందితో కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు

ఎమ్మిగనూరురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో కెనరా బ్యాంక్ మేనేజర్ శిరీషా ఆధ్వర్యంలో బీమా పథకాలపై మెప్మా, వెలుగు పొదుపు సంఘాల ఆర్పీలు, బుక్ కీపర్స్‌కు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బెంగుళూర్ నుంచి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంక్‌కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ జిల్లా మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

ఆదోని రూరల్: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ శనివారం ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయి. డాక్యుమెంట్ రైటర్లు వెంకోబరావు, ప్రతాప్‌రెడ్డి, శశి, కాదర్‌బాషా, నరసింగప్ప మాట్లాడుతూ ఈ ఓటీపీ విధానం వల్ల డాక్యుమెంట్ తయారు చేసేందుకు ఇబ్బందిగా మారుతోందన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆలస్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు ఎర్రిస్వామి, శంకరయ్యస్వామి, స్టాంపు వెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జీడీపీ నుంచి నీటి విడుదల



గాజులదిన్నె ప్రాజెక్ట్ నుంచి విడుదల అవుతున్న నీరు

గోనెగండ్ల : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గాజులదిన్నె ప్రాజెక్ట్‌కు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నీటిని శుక్రవారం ఉదయం జీడీపీ అధికారులు హంద్రీనదికి విడుదల చేశారు. జలాశయంలో 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం 4.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో శుక్రవారం ఉదయం ప్రాజెక్టు అధికారులు నాలుగో క్రస్ట్ గేటు ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని హంద్రీనదిలోకి విడుదల చేశారు. శుక్రవారం 600 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం జీడీపీలోకి కొనసాగుతుంది. ఎల్లెల్సీ నుంచి 100 క్యూసెక్కుల నీరు జీడీపీలోకి వస్తున్నట్లు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. 4 టీఎంసీల నీటిని నిలువ ఉంచే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జీడీపీ అధికారులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన కర్ణాటక మద్యం, మోటార్ సైకిల్‌ను చూపుతూ మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సైదుల్

ఆదోని రూరల్: ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కౌతాళం మండలం కుంబలనూరు వంక వద్ద కర్ణాటక మద్యాన్ని అక్రమంగా మోటార్ సైకిల్‌పై సరఫరా చేస్తున్న మబ్బు నరసింహ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ శనివారం తెలిపారు. సదరు వ్యక్తి వద్ద నుంచి ఒక మోటార్ సైకిల్, 2 బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇదే కేసులో మరో వ్యక్తి ముత్తన్నపై కూడా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు.

ఆ కళాశాలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని నలంద బీఈడీ కళాశాల నిబంధనలు పాటించడం లేదని, ఆ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఉదయ్, శేఖర్, ఖాజ, ఆఫ్రిది, రఘు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలులో రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటబసవరాజుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ కళాశాలలో బీఈడీ సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కొందరు బీఈడీ విద్యార్థులకు బ్లాక్ టీచింగ్ చేయకుండానే చేసినట్లు సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిపారు.

పెట్రోల్ బంకు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ఎమ్మిగనూరుటౌన్: పెట్రోల్ బంకుల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇచ్చి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహారెడ్డి, విజయేంద్ర డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ ముఖ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నా వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా శనివారం పట్టణంలో మూడవ వార్డులోని శ్రీవాణి విద్యాలయంలోబీజేపీ నాయకులు వీరేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కర్నూలు కిమ్స్ వైద్యులు గణప మహేష్ దాదాపు 174 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరసింహులు, వెంకటేష్, చిన్న ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో మట్కా రాస్తున్న ముగ్గురు బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. శనివారం మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. రచ్చుమర్రి గ్రామానికి చెందిన పింజరి నవాబ్, బోయ మజ్జిగ ఈరన్న, బోయ నర్సిరెడ్డిలు గ్రామంలోని జెమ్మిమరుసు వద్ద మట్కా రాస్తుండగా గుర్తించి పోలీసులు దాడులు చేశారు. అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.38, 450 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సన్మానం

ఆదోని అర్బన్: వరల్డ్ సాళి ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్ట్ సాకరే మారుతిరావు అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన రాసాలే గోవిందరావు, టీడీపీ పార్టీ పట్టణ కార్యదర్శిగా నియమితులైన సాకరే గోపాలకృష్ణలను స్థానిక సంఘం కార్యాలయంలో శాలువాలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

వెనుకబడిన పిల్లలపై శ్రద్ధ వహించండి

కోసిగి: తరగతిలో వెనుకబడిన సీ, డీ గ్రేడ్ పిల్లల ను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి చదువుల్లో ముందుకు రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ బాలయ్య సూచించారు. శనివారం కోసిగి మండలంలోని ఉన్న 6 క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యాక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్.ఏ-1 పరీక్షల ఆధారంగా పిల్లల స్థాయిని కేటాయించి దసరా సెలవుల అనంతరం నిర్వహించే ఎఫ్.ఏ-2 పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై చిత్తశుద్ధి లేని పాలకులు

ఆదోని రూరల్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన దిగుబడులకు కనీస మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు రాజాసాబ్ అన్నారు. శనివారం వారు జీపుజాతా ద్వారా ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడారు. ఉల్లికి ప్రభుత్వం క్వింటాల్ రూ.3 వేలు, టమాటా కిలో రూ.20 ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదిరి ఎల్లప్ప, బసాపురం గోపాల్, కరెంట్ ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత



ఆదోనిలో ర్యాలీగా వెళ్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

ఆదోనిటౌన్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ అన్నారు. శనివారం ఆదోని పట్టణంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

స్వచ్ఛ ఆంధ్ర కోసం పాటుపడుదాం

కౌతాళం: స్వచ్ఛ ఆంధ్ర కోసం పాటుపడాలని ఆదోని డీడీఓ బాలకృష్ణారెడ్డి, తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ అన్నారు. సర్పంచ్ పాల్‌దినకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా బయలుదేరి స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పాడి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.

పెద్దకడబూరు: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో హెచ్‌ఎం ఉమారాజేశ్వరి నేతృత్వంలో శనివారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా వుంచుకొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. స్వచ్ఛత హీ-సేవా, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని గణేష్ కాలనీలో పారిశుధ్య పనులు చేపట్టి కాలనీ వాసులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈలు నీరజ, రాజునాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. శనివారం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో మండల అధికారులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి సాయం



బాధితా కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: పట్టణ శివారులోని రాయనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యేసోబు(42) శనివారం గుండెపోటుకు గురై మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప చేతులమీదుగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. బాధితా కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మృతుడికి భార్య బుజ్జమ్మ, ఒక కుమార్తె ఉన్నారు. నాయకులు మాజీ కౌన్సిలర్ మోజెస్, దానం, రత్నం, ఏసు, భాస్కర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సురేష్‌గౌడుని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

నందవరం : మండల పరిధిలోని పూలచింత గ్రామ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సురేష్‌గౌడ్ మాతృమూర్తి జంబు పార్వతమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పార్లమెంట్ సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి శనివారం సురేష్‌గౌడుని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగపు అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి, వెంకటరెడి తదితరులు ఉన్నారు.

రణభేరిని విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

గోనెగండ్ల : విద్యారంగ సమస్యలు, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికై ఈనెల 25న గుంటూరులో యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే రణభేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుమ్మల బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో రణభేరికి సంబంధించిన పోస్టర్లను యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యా విధానం ప్రకటించాలని, అలాగే ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల సహాధ్యక్షులు అక్బర్, జిల్లా కౌన్సిలర్ అబ్దుల్ సలీం, సీనియర్ నాయకులు తాజుద్దీన్, చిన్న యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నందవరం : సాల్ట్ పథకంతో ప్రభుత్వ విద్యారంగం బలహీన పడుతుందని, తక్షణం సాల్ట్ పథకాన్ని రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించాలని యూటీఎఫ్ నాయకులు ఎస్.దావీదు, జె.ఎల్లప్ప, దేవపాల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రం నందవరం, కనకవీడు, ముగతి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 25న గుంటూరులో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ పోస్టర్లను విడదల చేశారు. నాయకులు వెంకటరాముడు, నరసింహులు, ఆంజనేయులు పాల్గొన్నారు.